RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | ఆదివారం | 11 -02 - 2024
సంపుటి: 1 | సంచిక : 267 | పేజీలు : 4 | వెల : 5/-

## అర్హులైన రైతులకే రైతుబంధు



4లో

# అంచనా భట్టి..



## తెలంగాణ బడ్జెట్ రూ.2,75,891కోట్లు

- రెవెన్యూ వ్యయం రూ. 2,01,178 కోట్లు
- ఆరు గ్యారెంటీలకు పెద్దపీట
- త్వరలో రైతు రుణమాఫీ
- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధి
- ప్రతి నియోజకవర్గానికి నిరుపేదలకు 3500 ఇళ్లు
- స్థలం ఉంటే రూ.5లక్షలు నిర్మాణ సహాయం
- అసెంబ్లీలో రేవంత్ సర్కార్ తొలి బడ్జెట్



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2024-25ను రాష్ట్ర ఆర్థిక మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,75,891 కోట్ల ఓట్-ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను సమర్పించారు.

**బడ్జెట్ స్వరూపం**

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2024-25 స్వరూపం ఇలా ఉంది. మొత్తం రూ.2,75,891 కోట్లకు బడ్జెట్ సమర్పించగా ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,01,178 కోట్లు కాగా మూలధన వ్యయం రూ.29,669 కోట్లుగా ఉంది.

**కేటాయింపులు ఇలా..**

తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలైన ఆరు గ్యారెంటీల అమలు కోసం 2024-25 బడ్జెట్‌లో అత్యధికంగా రూ.53,196 కోట్లు కేటాయించింది. ఇక మిగిలిన కేటాయింపులు ఇలా ఉన్నాయి.. ఐటీ శాఖకు రూ.774 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ.40,080 కోట్లు, పురపాలక శాఖకు రూ.11,692 కోట్లు, వ్యవసాయ శాఖకు రూ.19,746 కోట్లు, ఎస్సీ, ఎస్టీ గురుకుల భవనాల కోసం రూ.1,250 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.7,740 కోట్లు, నీటి పారుదల శాఖకు రూ.28,024 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.8 వేల కోట్లు కేటాయించింది.

**రూ.2 లక్షల రుణమాఫీకి కార్యాచరణ**

రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది రైతులు ఎదురుచూస్తున్న రుణమాఫీకి సంబంధించి మంత్రి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ కోసం త్వరలోనే కార్యాచరణ మొదలు పెట్టనున్నట్లు ప్రకటించారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా రైతులకు ఏటా రూ.15,000 పంట

మిగతా 4వ పేజీలో...

# బీజేపీ స్కెచ్.. కాంగ్రెస్ డిచ్..

## ప్రతిపక్షాలకు కొరకరాని కొయ్యగా కాషాయం పార్టీ

- రాజకీయ కిటుకుల్లో ఆరితేరిన నాయకత్వం
- పీవీకి భారతరత్నతో బీజేపీకి పెరిగిన ఇమేజ్
- కక్కలేక మింగలేక ఇరకాటంలో కాంగ్రెస్
- లోక్‌సభ ఎన్నికల ముంగిట బీజేపీ మైండ్‌గేమ్



3లో

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : ప్రత్యర్థిని గెలవాలి అంటే ఓడించడం ఒకటే మార్గం. కాకపోతే అలా ఓడించాలి అంటే చాలా కిటుకులు తెలిసి ఉండాలి. అలాంటి కిటుకులు ప్రదర్శిస్తున్నాడు కాబట్టే నరేంద్ర మోడీ రెండుసార్లు ప్రధానమంత్రి కాగలిగాడు. మూడోసారి కూడా ప్రధానమంత్రి అవుతాడని నమ్మకాన్ని సుస్థిరం చేసుకున్నాడు. తను మొదటి నుంచి బలమైన ప్రత్యర్థిగా నమ్ముతూ వస్తున్న కాంగ్రెస్ పార్టీని ఏ కీలుకు ఆ కీలు విరుచుకుంటూ వస్తున్నాడు. తాజాగా భారత మాజీ ప్రధాని.. దివంగత పీవీ నరసింహారావు కు భారతరత్న అవార్డు ప్రకటించి అందర్నీ ఆశ్చర్యం లో ముంచేశాడు. ఈ ఏడాది ఇప్పటికే లాల్ కృష్ణ అద్వానీ, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ కు భారతరత్న పురస్కారాన్ని కేంద్రం ప్రకటించింది. తాజాగా శుక్రవారం

మిగతా 2వ పేజీలో...

### 16లోగా ఫస్ట్ లిస్ట్?

- లోక్‌సభ అభ్యర్థుల జాబితా సిద్ధం
- పార్లమెంట్ ఎన్నికలకు కమలం సన్నద్ధం
- త్వరలో విడుదల కానున్న తొలి జాబితా
- భారీ అంచనాలతో బరిలోకి కమలం
- మూడోసారి మోదీ ప్రధానిగా వ్యూహాలు

# రేషన్‌కార్డే గీటురాయి!

- గృహజ్యోతి గ్రహపాటు
- ఒక్క కార్డు.. ఒక్క మీటర్.. ఒక్క ఫ్యామిలీకే వర్తింపు
- కుటుంబంతో విడిపోతే అంతే!
- ఉచిత విద్యుత్ హామీకి కండిషన్లు
- కార్డులేని వారి పరిస్థితి అంతేనా?



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించేందుకు కసరత్తు చేస్తోంది. ఈనెలలోనే పథకం అమలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత ఉచిత విద్యుత్ హామీ అమలు చేస్తారని తెలుస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. అయితే ఇందులో ఉచిత విద్యుత్ పొందేందుకు కొన్ని షరతులు పెట్టింది. తెల్ల రేషన్‌కార్డును తప్పనిసరి చేసింది. ప్రతినెలా 200 యూనిట్ల కన్నా తక్కువ విద్యుత్ వాడే వారికి ఈ ప్రయోజనం లభిస్తుంది. ఒకటి కంటే ఎక్కువ మీటర్లు ఉన్నవారికి ఇది వర్తించదు. అద్దె ఇళ్లలో ఉంటున్నవారు కూడా ఉచిత విద్యుత్ పథకానికి అర్హులే. హైదరాబాద్ వంటి నగరాల్లో అద్దె చెల్లించి నివసించే వారు, ప్రస్తుతం ఉంటున్న మీటరు నంబర్‌తో, రేషన్ కార్డు, ఆధార్ కార్డు జతచేయాల్సి ఉంటుంది. ఏ ప్రాంతంలో కూడా ఇక దరఖాస్తు చేసి ఉండకూడదు. సొంత గ్రామంలో ఇల్లు ఉండి హైదరాబాద్‌లో

మిగతా 2వ పేజీలో...

# హే.. కృష్ణా..!

## దక్షిణ తెలంగాణ రాజకీయాలపై కృష్ణా జలాల ప్రభావం



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : ఒకరిది పట్టు నిలుపుకొనే ప్రయత్నం.. మరొకరిది తిరిగి పట్టు నిరూపించుకునే తాపత్రయం... కోల్పోయిన చోట వెదుక్కోవాలన్న సూక్తికి కట్టుబడినట్లు.. ప్రధాన ప్రతిపక్షం భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎత్తులు వేస్తుంటే.. తమకు అత్యంత బలమున్న చోట ఇతరులకు చిన్న అవకాశం కూడా ఇవ్వొద్దన్న రీతిలో అధికార కాంగ్రెస్ వ్యవహరిస్తోంది.రెండు పార్టీల వ్యూహ ప్రతివ్యూహాలకు జలజగడం ప్రధాన కేంద్రంగా మారగా.. దానికి నల్గొండ వేదికవుతోంది. తెలంగాణలో అధికారం కోల్పోయేలా.. 2023 శాసన సభ ఎన్నికల్లో తమను దెబ్బతీసిన దక్షిణ తెలంగాణ నుంచి లోక్ సభ ఎన్నికల సమర శంఖం పూరించాలన్నది బీఆర్ఎస్ వ్యూహంగా కనిపిస్తోంది.2014, 2018 ఎన్నికల్లో అధిక సీట్లు దక్కించుకుని రెండు సార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కు మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం జిల్లాలు ఈ సారి పెద్ద దెబ్బకొట్టాయి. ఈ కారణంగానే బీఆర్ఎస్ అధికారానికి దూరం కావాల్సి వచ్చింది.లోక్ సభ ఎన్నికల్లో ఈ సారి ఆ పరిస్థితిని తారుమారు చేయాలని బీఆర్ఎస్ జల ఉద్యమానికి సిద్ధమవుతోంది. ఈ నెల 13వ తేదీన నల్గొండలో భారీ

మిగతా 3వ పేజీలో...

# ఉద్యోగుల గుండెల్లో రైళ్లు


## హెచ్‌ఎండీఏలో ఏసీబీ తనిఖీలతో ఆందోళన



4లో

# అయ్యో..ఎస్‌లు!

- అప్పుడు తలూపి.. ఇప్పుడు తాకట్లలో ఇరికి
- అవినీతి ఆరోపణల్లో చిక్కుకుంటున్న ఐఏఎస్‌లు
- ప్రభుత్వాలు, పాలకులు మారగానే అభాసుపాలు
- పాత సర్కారు హయాంలో ఇంకెందురున్నారో..?
- ‘బయటపడతారా?’ కేసుల పాలవుతారా..?



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణలో పలువురు కీలక ఉన్నతాధికారుల ఆస్తుల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గత బీఆర్ఎస్ హయాంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు భారీగా ఆస్తులు కూడబెట్టుకున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ఒక్కో అధికారికి సంబంధించిన ఆస్తుల చిట్టా వెలుగు చూస్తుండటం సంచలనం రేపుతున్నది. అవినీతి సొమ్ముతోనే వీరంతా పెద్దఎత్తున భూములు కొనుగోలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ భార్య పేరుతో 25 ఎకరాల భూముల వ్యవహారంపై పలు అనుమానాలు రేకెత్తుతున్న వేళ తాజాగా మరో కీలక రిటైర్డ్ ఏఐఎస్ అధికారి రజత్ కుమార్ భూముల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. రజత్ కుమార్, ఆయన కుటుంబ సభ్యుల పేరిట ఏకంగా 52 ఎకరాల భూములు ఉన్నట్లు తాజాగా వెలుగు చూసింది. ఈ వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర అధికార వర్గాల్లో సంచలనంగా మారింది.మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్ మండలం హేమాజిపూర్ గ్రామంలోని సర్వే

మిగతా 2వ పేజీలో...

# మండుతున్న ఎండలు



మార్చి నెల రానేలేదు... మాడు పగలగొట్టేస్తున్నాయి ఎండలు. ఫిబ్రవరి మెదటివారంలోనే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఓవైపు భానుడి భగభగలు.. మరోవైపు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే... నడి వేసవిలో పరిస్థితి ఏంటని భయపడిపోతున్నారు.

3లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

## బండలేమూరు మాజీ సర్పంచ్ మంగ శ్రీనివాస్

**మంచాల - ప్రభాత సూర్యుడు :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని బండలేమూరు మాజీ సర్పంచ్ మంగ శ్రీనివాస్ కోరారు. గత 30-35 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే లేక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎంతో ఇబ్బంది పడ్డారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఒడిదుడుకులను తట్టుకొని మల్ రెడ్డి రంగారెడ్డి అండదండలతో ముందుకెళ్లడం జరిగింది. గతంలో కేసులు పెట్టిన పార్టీ మారకుండా కాంగ్రెస్ పార్టీ కోసం నాయకులు కార్యకర్తలు పని చేశారు. రంగారెడ్డి జిల్లా నుండి సీనియర్ నాయకుడైన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.




# డ్రగ్స్ నిర్మూలనలో యువత చురుగ్గా ఉండాలి




- **సందీప్ శాండిల్య ఐపీఎస్**
- **పోలీసులు, విద్యార్థులు సమిష్టి కృషితో మాదక ద్రవ్యాలను నిర్మూలించాలి**

**ఇబ్రహీం పట్నం - ప్రభాత సూర్యుడు :** మాదకద్రవ్యాల వినియోగం నివారణపై అవగాహన కల్పించే లక్ష్యంతో, రాచకొండ భద్రతా మండలి రాచకొండ పోలీస్ కమిష నరేట్ సహకారంతో, శనివారం హైదరాబాద్ లోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో మత్తుపదార్థాల దుర్వినియోగ నిరోధక సదస్సు 2024 ను నిర్వ హించారు. డ్రగ్స్‌పై అవగాహన కల్పించే మార్గదర్శకాల పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్ బ్యూరో (టీఎస్ఎన్ఏబీ) డైరెక్టర్ సందీప్ శాండిల్య ఐపీఎస్, రాచకొండ సిపి సుధీర్ బాబు ఐపీఎస్, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఐపీఎస్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం సమాజంపై, ముఖ్యంగా యువతపై ఎలాంటి దుష్ప్రభావం చూపుతోందో వివరించారు. డ్రగ్స్ ఇతర నిషేధించబడిన సైకోట్రోపిక్ పదార్థాలు వాడడం ద్వారా తెలివైన విద్యార్థులు తమ విద్య భవిష్యత్తును ఎలా పాడు చేసుకుంటున్నారో వివరించారు. అన్ని రకాల మాదక ద్రవ్యాల దుర్వినియోగాన్ని నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. డ్రగ్స్‌పై పోరును సామాజిక బాధ్యతగా తీసుకోవాలని, మాదకద్రవ్యాల రహిత సమాజ లక్ష్యాన్ని సాధించే సామాజిక ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పోలీసులకు సూచించారు. నగరంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కొత్త సంవత్సరానికి ముందు పబ్‌లను తనిఖీ చేశామన్నారు. డ్రగ్స్ ప్రాణాంతకమని, వాటి వినియోగం వల్ల మెదడు నియంత్రణ కోల్పోతుందని, జీవితంలో అనేక అనర్థాలకు దారితీస్తాయని పేర్కొన్నారు. డ్రగ్స్ వాడితే ముందు రెచ్చిపోయి ఆ తర్వాత అలవాటైపోతుంది, అది లేకుండా బతకలేం అన్న స్థాయికి దిగజారుస్తుందని అన్నారు. మత్తు పదార్థాలు ఒక్కసారి సేవిస్తే వాటికి శరీరం అలవాటు పడుతుందని, వాటిని మానుకోవాలని, డ్రగ్స్‌కు బానిసలుగా మారిన వారి జీవితాలు దుర్భరంగా మారుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎరిన్ ఫిషర్, యుఎస్ కాన్సులెట్ చీఫ్ ఇన్వెస్టిగేటర్, భోంగిరి డీసీపీ రాజేష్ చంద్ర ఐపీఎస్, డీసీపీ మల్కాజిగిరి పద్మజ ఐపీఎస్., డీసీపీ ఎస్‌ఓటీ గిరిధర్ ఐపీఎస్, ఎల్బి నగర్ డీసీపీ ప్రవీణ్ ఐపీఎస్, ఎస్బి డీసీపీ కరుణాకర్, డీసీపీ అడ్మిన్ ఇందిర, డీసీపీ మహేశ్వరం సునీతారెడ్డి, డీసీపీ ఎస్‌ఓటీ మురళీధర్, ఏడీసీపీ అడ్మిన్ శ్రీనివాస్ రెడ్డి, ఎండ్ నౌ ఫౌండర్ అనిల్ రాచమల్ల, ఆర్కేఎస్సీ కోశాధికారి గగన్ దీప్ కోహ్లి, ఇతర అధికారులు పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# మంచాల సీఐకి కాంగ్రెస్ నేతల సన్మానం

- **పోలీస్ అధికారుల సేవలు మరువలేనివి**
- **కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు**
- **సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్**



**మంచాల -ప్రభాత సూర్యుడు :** మంచాల మండలం ఆరుట్ల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల భాష ఆధ్వర్యంలో మంచాల పోలీస్ స్టేషన్ కు వెళ్లి నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన సీఐ బాబ్యా నాయక్‌ను కలిసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు కావలి బుగ్గ రాములు ముదిరాజ్ సీనియర్ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్ కలిసి మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి చిన్న సంఘటనలు జరిగిన ఒక దేవుడిలా ముందుగా స్పందించే అధికారులు ఎవరంటే అది పోలీస్ అధికారులే అన్నారు. కరోనా సమయంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజలకు అండగా ఉన్న గొప్ప అధికారులు పోలీస్ శాఖ అధికారులు . పోలీస్ అధికారుల సేవలు మరువలేనివి అన్నారు నూతనంగా సీఐగా బాధ్యతలు చేపట్టిన సిఐ బాబ్యా నాయక్ మంచాల మండలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి పోలీస్ అధికారిగా పేరు తెచ్చుకోవాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పంబాల బుగ్గ రాములు, ఆరుట్ల గ్రామ శాఖ కార్యదర్శి దాసర మోని రమేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు తలారి కృష్ణ ముదిరాజ్, ఆరుట్ల గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కంబాలపల్లి బుగ్గ రాములు, బుట్టి జంగయ్య ముదిరాజ్, నేనావత్ శ్రీనివాస్ నాయక్, బుట్టి కృష్ణ ముదిరాజ్, మంచాల మండలం సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఎండి బురాన్, తదితరులు పాల్గొన్నారు.



హత్తిగూడ సర్వే నెంబర్ 12 లో ప్రభుత్వ భూమిని కౌన్సిలర్ లక్ష్మణ్ తో కలిసి పరిశీలిస్తున్న తహసిల్దార్ రవీంద్ర దత్తు తదితరులు

# కబ్జా కోరల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలి

**కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్**

**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు :** మండల పరిధిలోని కుంట్లూర్ గ్రామం హత్తిగూడ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 12 లోని 2 ఎకరాల 33 గుంటల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని, కబ్జాకు గురికాకుండా ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ అబ్దుల్లాపూర్ మెట్ మండల తహసిల్దార్ రవీంద్ర దత్తుకు ఫిర్యాదు చేశారు. అట్టి ప్రభుత్వ భూమిని క్రీడా ప్రాంగణానికి కేటాయిస్తే మున్సిపాలిటీ నిధుల నుండి అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తహసిల్దార్ కు తెలిపారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశా-రు. అందుకు సానుకూలంగా స్పందించిన తహసిల్దార్ రవీంద్ర దత్తు హత్తిగూడ సర్వే నెంబర్ 12 లోని ప్రభుత్వ భూమిని కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, సిపిఐ నాయకులు ముత్యాల యాదిరెడ్డిలతో కలిసి శనివారం పరిశీలించారు. వీలైనంత త్వరలో సర్వే నిర్వహించి సూచిక బోర్డును నాటుతామని తాసిల్దార్ తెలిపినట్లు పేర్కొన్నారు.

# అయ్యో..ఎస్‌లు!

మొదటిపేజీ తరువాయి..

నెంబర్ 77,78, 82 రజత్ కుమార్ ఆయన కుటుంబ సభ్యుల పేరుతో 52 ఎకరాల భూములు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. రజత్ కుమార్ పేరిటే 15 ఎకరాల 25 గుంటల భూమి కొనుగోలు చేశారని అయితే ఈ భూములు కొన్న వ్యవహారం డీఓపీటీకి రజత్ కుమార్ సమాచారం ఇచ్చారా లేదా అనేది క్లారిటీ లేదు. కాగా ఇటీవల రాష్ట్రంలోని అధికారుల భూముల కొనుగోలు వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు రావడంతో తన పేరుతో ఉన్న భూములను రజత్ కుమార్ అమ్మకానికి పెట్టారనే టాక్ వినిపిస్తోంది. నేడో రేపో తన భూములను ఇతరుల పేరు మీదకు బదలాయించేందుకు రజత్ కుమార్ ప్రత్నాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే ప్రభుత్వం మారిన 2 నెలలకే రజత్ కుమార్ ఎందుకు భూమి అమ్మాలనుకుంటున్నారనేది ప్రస్తుతం చర్చనీయాశంగా మారింది.



# రేషన్‌కార్డే గీటురాయి!

మొదటిపేజీ తరువాయి..

అద్దెకు ఉంటున్న వారు ఏదో ఒక్కచోట మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. రెండుచోట్ల లబ్ధి పొందడం కుదరదు. ఒక్క రేషన్ కార్డుతో ఒక్క కుటుంబానికి మాత్రమే లబ్ధి చేకూరుతుంది. రేషన్ కార్డులో పేరు ఉండి.. పెళ్లి తర్వాత వేరుపడిన వారికి గృహజ్యోతి వర్తించదు. తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ఒక రేషన్ కార్డు, ఒక మీటర్, ఒక కుటుంబం మాత్రమే అనుసంధానం చేస్తారు. మీటర్ రీడింగ్ తీసే సిబ్బందితోనే లబ్ధిదారులను గుర్తిస్తారు. ఇప్పటికే ఈ ప్రక్రియ చాలాచోట్ల ప్రారంభమైంది. మీటర్ రీడర్‌కు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ లింక్ చేసి రీడింగ్ తీస్తారు. ఎవరైతే 200 లోపు యూనిట్ల విద్యుత్ వాడుతున్నారో వారికి జీరో బిల్లు తీసి ఇస్తారు. ఇప్పటికే లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో మార్చి నుంచి గృహజ్యోతి పథకం అమలులోకి వచ్చే అవకాశం ఉంది. ఇది అమలులోకి వస్తే పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఊరట లభిస్తుంది.

# బీజేపీ స్కెచ్.. కాంగ్రెస్ డిచ్..

మొదటిపేజీ తరువాయి..

చరణ్ సింగ్, ఎంఎస్ స్వామినాథన్, పీవీ నరసింహారావు కు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించింది. స్వామినాథన్, చరణ్ సింగ్ విషయాలను కాస్త పక్కన పెడితే.. నరసింహా రావుకు భారతరత్న పురస్కారాన్ని అందించడం పట్ల తెలుగు రాష్ట్రాలలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి ఇంతవరకు ఎటువంటి ప్రకటనలు రాలేదు. ఢిల్లీలో ఉన్న కాంగ్రెస్ అధిష్టానం కూడా ఎటువంటి స్పందనను వెలి బుచ్చలేదు. నాడు పివి నరసింహారావు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు.. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు.. సోనియా కోటరి అంతగా విలువనిచ్చేది కాదు. పైగా ఆయనను అనేక రకాలుగా వేధింపులకు గురిచేసింది. కాంగ్రెస్ పార్టీలో అలవాటైన గ్రూపు రాజకీయాలను పెంచి మరింత పోషించడంతో పీవీ నరసింహా రావు ఒకింత మనోవేదనకు గురయ్యారు. చివరికి ఆయన పరమపదించిన తర్వాత కూడా పార్థివదేహానికి కాంగ్రెస్ పార్టీ ఘనమైన నివాళులు అర్పించలేదు. బహుభాషా కోవి దుడు, ఆర్థిక పితామహుడు, సంస్కరణల పితామహుడు అయినప్పటికీ ఆయన పార్థివ దేహానికి నాటి కాంగ్రెస్ పార్టీ సరైన వీడ్కోలు పలకలేదు. చివరికి ఆయన భౌతికకాయాన్ని కూడా పార్టీ కార్యాలయంలోకి అనుమతిం చలేదు. అప్పట్లోనే కాంగ్రెస్ పార్టీ వ్యవహరిం చిన తీరుపై ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ పెద్దలు తమ తీరు మార్చుకోలేదు. సంతాప తీర్మానాన్ని కూడా ప్రకటించలేదు. అంతేకాదు కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు పీవీ నరసింహారావు జయంతి, వర్ధంతిని ఘనంగా జరిపిన దాఖ లాలు లేవు. ఆయనకు భారతరత్న పురస్కారం ఇవ్వాలనే కనీస సోయి కూడా ఆ పార్టీకి లేదు.పీవీ నరసింహారావుకు సంబంధించి జరి గిన అవమానంపై ఆయన కుటుంబ సభ్యులు ఎలుగెత్తినప్పటికీ కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడు కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. చివరికి పివి నరసింహారావు ఘనతను భారతీయ జనతా పార్టీ గుర్తించింది. బహుభాషా కోవిదుడికి.. ఆర్థిక రంగ పితామహుడికి భారతరత్న పురస్కారం అందించి ఆయన సేవలకు నిజమైన గౌరవం కల్పించింది. నాడు పీవీ నరసింహారావు తీసుకొచ్చిన సరళీకృత ఆర్థిక విధానాల వల్లే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందడం మొదలు పెట్టింది. నాడు ఆయన చేసిన ఘనతను గుర్తుంచుకొని బిజెపి భారతరత్న పురస్కారాన్ని ప్రకటించింది. మరికొద్ది రోజుల్లో పార్లమెంటు ఎన్నికలు ఉన్న నేపథ్యంలో బిజెపి తీసుకున్న నిర్ణయం రాజకీయంగా సంచలనంగా మారే అవకాశం ఉంది. ఎందుకంటే పీవీ నరసింహారావు తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడం.. తెలంగాణ ప్రాంతంలో భారతీయ జనతా పార్టీ కొద్దో గొప్పో బలంగా ఉండటంతో.. తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయం తమకు లాభిస్తుందని బిజెపి నాయకులు భావిస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో నాలుగు స్థానాలను గెలుచుకున్న బిజెపి.. అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించినంత స్థాయిలో ప్రభావం చూపించలేకపోయింది. పీవీ నరసింహారావుకు భారతరత్న



పురస్కారం ప్రకటించిన నేపథ్యంలో తమకు సీట్లు పెరుగుతాయని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ పీవీ నరసింహారావును ఓన్ చేసుకోలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో మాత్రమే భారత రాష్ట్ర సమితి పీవీ నరసింహారావు పేరును స్మరించింది. ఆ తర్వాత విస్మరించింది. కానీ బిజెపి ప్రభుత్వం తన పార్టీ వాడు కాకపోయినప్పటికీ.. రాష్ట్రపతి భవన్ ద్వారా దేశంలో అత్యున్నత పురస్కారాన్ని అందజేసింది. పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం ప్రకటించిన నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తుండడం విశేషం.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# 16 లోపు బీజేపీ జాబితా

హైదరాబాద్, – ప్రభాతసూర్యుడు : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మెరుగైన స్థానాలు సాధించింది బీజేపీ. అదే జోష్‌ను లోక్ సభ ఎన్నికల్లో కూడా కొనసాగించాలని భావిస్తోంది. ఇందుకోసం లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై బీజేపీ కసరత్తు చేస్తోంది. అభ్యర్థుల ఎంపికపై హైకమాండ్‌తో బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి చర్చలు జరిపారు. ఫిబ్రవరి 16లోపే అభ్యర్థులను ప్రకటించనున్నట్లు కేంద్ర ఎన్నికల కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే ఎవరికి ఏ స్థానాలు కేటాయిస్తారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ఈ స్థానాల నుంచి బరిలో దిగేందుకు ఈ అభ్యర్థులు సిద్దంగా ఉన్నారు.సికింద్రాబాద్ నుంచి కిషన్ రెడ్డి, కరీంనగర్ నుంచి బండి సంజయ్ పోటీ చేసేందుకు సిద్దంగా ఉన్నారు. అలాగే నిజామాబాద్ నుంచి ధర్మపురి అరవింద్, చేవెళ్ల నుంచి కొండా విశ్వేశ్వర్ రెడ్డి లోక్ సభ ఎన్నికల బరిలోకి దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇక భువనగిరి నుంచి బూర నర్సయ్య గౌడ్, మహబూబ్‌నగర్ నుంచి డీకే అరుణ పోటీ చేయాలని భావిస్తున్నారు. మల్కాజిగిరి టికెట్ కోసం మురళీధర్ రావు, ఈటెల రాజేందర్ పేర్లు పరిశీలిస్తున్నారు. మల్కాజ్‌గిరి, మెదక్, హైదరాబాద్ అభ్యర్థులను ఫైనల్ చేయనుంది బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటి.మహబూబాబాద్ టికెట్ కోసం మాజీ ఎంపీ సీతారాం నాయక్ ప్రయత్నాలు చేస్తున్నారు. పెద్దపల్లి, మహబూబాబాద్‌లలో కాంగ్రెస్ నేతలను చేర్చుకుని టికెట్ ఇచ్చే యోచనలో కమలం పార్టీ ఉంది. నాగర్ కర్నూలు, వరంగల్, జహీరాబాద్, అదిలాబాద్.. అభ్యర్థుల కోసం బీఆర్ఎస్ నేతలపై కాషాయ పార్టీ కన్నేసింది. ఖమ్మం, నల్గొండలలో బయటి నుంచి వచ్చిన వారికే అవకాశం ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఫిబ్రవరి 10 నుంచి 16లోపే అభ్యర్థుల తుది జాబితా విడుదల అయ్యే అవకాశం ఉంది.

# మేడారంలో అర్ధరాత్రి హైడ్రామా?




ములుగు - ప్రభాతసూర్యుడు : మేడారంలో శుక్రవారం ఆర్ధరాత్రి ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలో ఉన్న స్థానిక చిరు వ్యాపారుల షాప్ లను అధికారులు కూలగొట్టారు. అదనపు కలెక్టర్ వాహనాన్ని అడ్డుకొని మేడారం గ్రామ చిరు వ్యాపారులు నిరసన వ్యక్తం చేసారు. మంత్రి సీతక్క డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేసారు. ప్రభుత్వం వైఖరిపై మేడారం గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. న్యాయం చేయాలంటూ ఆందోళనలకు దిగారు.

# గులాబీ గూటికి కాంగ్రెస్ నేతలు



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇటీవలే ఒకసారి నలుగురు ఎమ్మెల్యేలు, మరోసారి ఒక ఎమ్మెల్యే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. వారు సీఎంవోకు వెళ్లే వరకు ఎవరికీ తెలియదు. ఇక తర్వాత, నాలుగు రోజుల క్రితం బీఆర్ఎస్‌కు చెందిన పెద్దపల్లి సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్‌నేత కాంగ్రెస్‌లో చేరారు. అధికారం కోల్పోవడంతో పట్టు కోల్పోతున్న గులాబీ దళంలోంచి ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. అధికార పార్టీలో చేరుతున్నారు. తాజాగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డితోపాటు వికారాబాద్ జెడ్పీ ఛైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డి గురువారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. త్వరలో కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.పట్నం మహేందర్‌రెడ్డి చేవెళ్ల ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. బీఆర్ఎస్‌లో టికెట్ వచ్చే అవకాశం లేకపోవడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరాలని భావిస్తున్నట్లు ఆయన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. రాజకీయాల్లో ఎవరి అభిప్రాయం వారిదన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీలో చేరే విషయంపై మాత్రం తనకు చెప్పలేదన్నారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విపక్ష పార్టీల నుంచి అధికార పార్టీలోకి చేరాలనుకునేవారి సంఖ్య పెరుగుతోంది. ఈమేరకు సీఎంతో భేటీ అవుతున్నారు. అయితే తర్వాత మర్యాదపూర్వకంగానే కలిశామని చెబుతున్నప్పటికీ రాజకీయ ప్రయోజనాల కోసమే అనేది వాస్తవం. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు కలిశారు. మరుసటి రోజు నియోజకవర్గ అభివృద్ధి కోసమే అని చెప్పారు. తర్వాత రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కలిశారు. ఆయన కూడా నియోజకవర్గ డెవలప్మెంట్ కోసమే అన్నారు.అయితే పట్నం మహేందర్‌రెడ్డి దంపతులతోపాటు ఆయన కుమారుడు కూడీ సీఎంను కలిసినవారిలో ఉన్నారు. పట్నం దంపతులు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరతారని తెలుస్తోంది. మహేందర్‌రెడ్డి ప్లామెంటు ఎన్నికల్లో చేవెళ్ల టికెట్ ఆశిస్తున్నారు. దీనిపై సీఎం కూడా హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.అసెంబ్లీ ఎన్నికలకు ముందే పట్నం దంపతులు కాంగ్రెస్ పార్టీ లో చేరాలనుకున్నారు. అప్పుడు సీటు ఇవ్వకోవంతో మహేందర్ రెడ్డిని ఎమ్మెల్సీని చేసి మంత్రిపదవి ఇవ్వడంతో చల్లబడ్డారు. తాజాగా చేరిక ఖాయమని అంటున్నారు. పట్నం దంపతుల వెంట జిల్లాలో చాలా మంది బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరతారని అంటున్నారు. దీంతో జిల్లాలో బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని పలువురు పేర్కొంటున్నారు.మాజీ సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గం అయిన గజ్వేల్‌లో కూడా బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. ఇప్పటికే వరుసగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డిని కలుస్తున్నారు. 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారని మాజీ ఎమ్మెల్యే జెగ్గారెడ్డి తెలిపారు. ఈ క్రమంలో కేసీఆర్ నియోజకవర్గంలోనే బీఆర్ఎస్ నేతలు గులాబీ బాస్‌కు షాక్ ఇచ్చారు.తూప్రాన్ మున్సిపాలిటీలో ఏడుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మున్సిపల్ చైర్మన్ వ్యవహార శైలిపై, బీఆర్ఎస్ చైర్మన్ హయాంలో మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై వారంతా ఆరోపణలు చేశారు. ఒకవైపు కేసీఆర్ పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తెచ్చేందుకు ఉత్సాహం నింపేందుకు యత్నిస్తుండగా, నేతలు షాక్‌లు ఇస్తుండడం చర్చనీయాంశమైంది.

# మండుతున్న ఎండలు



హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : మార్చి నెల రానేలేదు... మాడు పగలగొట్టేస్తున్నాయి ఎండలు. ఫిబ్రవరి మె?దటివారంలోనే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఓవైపు భానుడి భగభగలు.. మరోవైపు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. బయట అడుగుపెడితే... కాళ్లు మాడిపోతున్నాయి. మాడు పగిలిపోతోంది. ఇవేం ఎండలురా బాబోయ్ అంటూ జనం అల్లాడిపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే... నడి వేసవిలో పరిస్థితి ఏంటని భయపడిపోతున్నారు. సాధారణంగా ఫిబ్రవరి నెలాఖరు నుంచి ఎండలు మెల్లమెల్లగా పెరుగుతూ వస్తాయి. ఏప్రిల్‌లో దంచికొడతాయి. కానీ... ఈఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచి భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. బయటికి వెళ్తే.. తాట తీసేస్తున్నాడు. తెలంగాణ వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరవలో ఉన్నాయి. ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లోనూ గరిష్ఠ ఉష్ణోగ్రత 38.4 డిగ్రీలు దాటేసింది. ఈ ఎండలకే తట్టుకోలేకపోతుంటే... వాతావరణ శాఖ... మాడుపగలగొట్టే మరో వార్త మోసుకొచ్చింది. మరో నాలుగు రోజులు ఇదే పరిస్థితి ఉంటుంది.. ఎండలు మరింత ముదురుతాయని వెదర్ రిపోర్ట్ చెప్తోంది. ఈ వార్త విని జనం మరింత బెంబేలెత్తుతున్నారు. ఈ ఎండలను ఎలా తట్టుకోవాలో అంటూ... తలలు పట్టుకుంటున్నారు. వేసవి మొదలే కాలేదు... ఇప్పుడు ఎండ వేడి భరించలేకపోతున్నామని వాపోతున్నారు. నిన్న ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువ కావడంతో ప్రజలు కూడా రోడ్ల మీదకు రావడానికి భయపడిపోతున్నారు. రాత్రి వేళ కూడా ఉక్కపోత తప్పడం లేదు. ఇప్పటి నుంచే ఇళ్లలో ఏసీలు, కూలర్లు... తెగ వాడేస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల వరకు మాత్రమే చల్లని గాలులు వీస్తున్నాయి.

# హే.. కృష్ణా..!



మొదటిపేజీ తరువాయి..

బహిరంగ సభ జరపాలని నిర్ణయించింది.క్రిష్ణా నదిపై ఉన్న సాగునీటి ప్రాజెక్టులను క్రిష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డు (కె.ఆర్.ఎం.బి)కి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించిందని, దీనివల్ల తెలంగాణ జుట్టును కేంద్రం చేతిలో పెట్టడమేనని విమర్శిస్తూ, కాంగ్రెస్ చేసిన ఈ చర్య వల్ల క్రిష్ణా నదీ పరీవాహక జిల్లాల తాగు, సాగునీటికి తండ్లాడాల్సి వస్తుందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీఆర్ఎస్ భావిస్తోంది.అయితే.. తెలంగాణ శాసన సభ ఎన్నికల ఓటింగ్ కు ఒక రోజు ముందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నల్గొండ జిల్లా పరిధిలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టుకుపై దాడి చేసింది. తమ పోలీసులను, ఇరిగేషన్ అధికారులను పంపించి బలవంతంగా 2వేల క్యూసెక్కుల నీటిని తరలించుకు పోయింది.అప్పటి తెలంగాణ ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తుండిపోయింది. ఈ వ్యవహారమంతా ఆ సమయంలోని తెలంగాణ సీఎం కేసీఆర్, ఏపీ సీఎం జగన్ పరస్పర అవగాహనతోనే చేసిన పని అని, తెలంగాణలో అధికారానికి దూరం అవుతున్నామని భావించిన కేసీఆర్ తెలంగాణ సెంటిమెంట్ రగిలించి ఓట్లు దండుకునేందుకు పన్నిన కుయుక్తిగా కాంగ్రెస్ ప్రచారం చేసింది.రాష్ట్రం ప్రభుత్వం మారాక.. క్రిష్ణా నదిపై ప్రాజెక్టుల నిర్వహణపై కె.ఆర్.ఎం.బి గతేడాది డిసెంబరు 17వ తేదీన ఒక సమావేశం కూడా జరిపింది. ఈ సమావేశం మినిట్స్ బయటకు రావడంతో, క్రిష్ణానదిపై ఉన్న శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నిర్వహణను కె.ఆర్.ఎం.బి పరిధికి ఇచ్చివేసినట్లు బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది.అది గత ప్రభుత్వ హయాంలో జరిగిందని, తమపై తప్పుడు ప్రచారం చేసస్తున్నారని తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. ఈ విషయంలో అమీతుమీ తేలుచుకునేందుకు ఇరు పార్టీలు సిద్ధపడుతున్నాయి.క్రిష్ణా ప్రాజెక్టుల నిర్వహణ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుని వచ్చే లోక్ సభ ఎన్నికల్లో లబ్దిపొందాలని బీఆర్ఎస్ చూస్తోంది. ఈ నెల 13వ తేదీన నల్గొండలో భారీ బహిరంగ సభను తలపెట్టింది. దీనికోసం ఇప్పటికే నియోజకవర్గాల వారీగా మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులను ఇన్ ఛార్జులుగా నియమించింది.ప్రతీ నియోజకవర్గం నుంచి కనీసం 15వేల మందిని సమీకరించాలని నిర్ణయించింది. దీనికి ప్రతిగా కాంగ్రెస్ సైతం కనీసం రెండు లక్షల మందికి తగ్గకుండా నల్లగొండలోనే ఓ బహిరంగ సభను జరపాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది.ఈ మేరకు నల్గొండ జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఇరిగేషన్ శాఖా మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి మధ్య చర్చ కూడా జరిగిందంటున్నారు. ఈ బహిరంగ సభకు కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని రప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. క్రిష్ణా ప్రాజెక్టుల నిర్వహణ అంశం ఎజెండగా కాంగ్రెస్, బీఆర్ఎస్ లు పన్నుతున్న ఎన్నికల వ్యూహాలు ఆసక్తి గొల్పుతున్నాయి.

# అంచనా భట్టి..



మొదటిపేజీ తరువాయి..

పెట్టుబడి సాయం, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు, వరి పంటకు క్వింటాల్ రూ.500 చొప్పున కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది.

**మార్పు కోరిన ప్రజలు:**

మార్పును కోరుతూ తెలంగాణ ప్రజలు స్వేచ్ఛను సాధించుకున్న ప్రజలకు మనస్ఫూర్తిగా భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించే స్ఫూర్తితో బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు చెప్పారు. తెలంగాణ త్యాగమూర్తులు ఏ ఆశయాలతో ఆత్మార్పణ చేశారో వాటిని ఆచరణలోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అందరికోసం స్ఫూర్తితో పాలన అందిస్తున్నామని తెలిపారు. పదేళ్ల తర్వాత నిజమైన ప్రజాస్వామ్యం ఏంటో తెలంగాణ చూస్తోందని పేర్కొన్నారు. రైతులు, మహిళలు, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రజలకు నిజమైన ప్రతినిధులుగా ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామని ఉద్ఘాటించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ఈ ప్రభుత్వం ఎంతటి సాహసమైనా చేస్తుందని తెలిపారు.

**నిజమైన ప్రజాస్వామ్యం:**

పదేళ్ల తర్వాత నిజమైన ప్రజాస్వామ్యం ఏంటో తెలంగాణ చూస్తోందని పేర్కొన్నారు. రైతులు, మహిళలు, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రజలకు నిజమైన ప్రతినిధులుగా ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామని ఉద్ఘాటించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ఈ ప్రభుత్వం ఎంతటి సాహసమైనా చేస్తుందని తెలిపారు. నిస్సహాయులకు సహాయం చేయడమే తమ లక్ష్యమని వివరించారు. "దావోస్ పర్యటన ద్వారా రాష్ట్రానికి రూ.40 వేల కోట్లు పెట్టుబడులు రానున్నాయి. పీఎం మిత్ర నిధులతో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు మరింత అభివృద్ధి చేస్తాం. ప్రభుత్వం నుంచి రెండు లెదర్ పార్కులు, రాష్ట్రం నలుమూలలా ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేస్తాం. డ్రైపోర్టులను అందుబాటులోకి తెచ్చేందుకు బృహత్ ప్రణాళిక రచిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృత్రిమ మేధ ఉపయోగిస్తాం. ఐటీని రాష్ట్ర నలుమూలలకు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. దేశంలోనే అత్యంత పటిష్ఠమైన ఫైబర్ నెట్‌వర్క్ కనెక్షన్లు ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం." అని చెప్పారు. గత పాలకుల నిర్వాకంతో ధనిక రాష్ట్రంలోనూ ఆర్థిక కష్టాలు వచ్చాయని, కానీ తమ ప్రభుత్వ లక్ష్యం సంతులిత వృద్ధి అని భట్టి స్పష్టం చేశారు. ఆర్భాటాలు, ఆకర్షణలకు దూరంగా తమ ప్రభుత్వం ఉంటుందన్న ఆయన రుతుపవనాల ప్రభావం ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా పడిందని చెప్పారు. వ్యవసాయ రంగంలో క్షీణత ప్రజల ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపిందని, వ్యవసాయంలో వృద్ధిలేమి ఇతర రంగాలపై పడిందని తెలిపారు. దీనివల్ల ఆహార పంటలు, వాణిజ్య పంటల్లో దిగుబడులు తగ్గాయని పేర్కొన్నారు. "ధరణి కొందరికి భరణం. మరికొందరికి ఆభరణం. చాలామందికి భారం. ధరణి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తాం. రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనకు సత్వర చర్యలు తీసుకుంటాం. ధరణి పోర్టల్ సమస్యల అధ్యయనానికి కమిటీ వేశాం అన్నారు. వ్యవసాయ రంగంలో త్వరలో నూతన విత్తన విధానం తీసుకువస్తాం. ప్రతి పంటకు మద్దతు ధర కల్పిస్తాం. ప్రధాని పసల్ బీమా ఆధారంగా రాష్ట్రంలో సమగ్ర పంటల బీమా పథకం తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం." అన్నారు .రాష్ట్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని భట్టి అన్నారు. సకాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి మండలానికి అంతర్జాతీయ ప్రమాణాలతో పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తామన్న ఆయన పైలట్ ప్రాజెక్టు కింద తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు రూ.500 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఉన్నత విద్యామండలి సంపూర్ణ ప్రక్షాళనకు కృషి చేస్తామని తెలిపారు.

**విద్యుత్ రంగానికి..**

రాష్ట్రంలో రైతులకు 24 గంటలపాటు కరెంట్ అందించనున్నట్లు మంత్రి చెప్పారు. గృహ జ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇస్తామని తెలిపారు. ఇందుకోసం రూ.2,418 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ట్రాన్స్‌కో, డిస్కమ్‌లకు రూ.16,825 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అలాగే ఈ ఈ బడ్జెట్‌లో గృహనిర్మాణ శాఖకు రూ.7,740 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గత సర్కార్ పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇస్తామని చెప్పి మోసం చేసిందని, కాంగ్రెస్ సర్కార్ ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇళ్లు లేనివారికి ఇల్లు, స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి ఇవ్వబోతున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ఇస్తామని భట్టి పేర్కొన్నారు.

# 26మల్లారెడ్డి యూనివర్సిటీ ముందు విద్యార్థుల ధర్నా

కుత్బుల్లాపూర్ - ప్రభాతసూర్యుడు : మైసమ్మ గూడ లోని మల్లారెడ్డి యూనివర్సిటీ వద్ద విద్యార్థులు ధర్నాకు దిగారు. గత కొద్ది రోజులుగా నాణ్యత లేని ఆహారం పెడుతూ



విద్యార్థుల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారనీ ఈ విషయంపై స్పందించాలని డిమాండ్ చేసారు. కళాశాల ఇంచార్జ మహేందర్ రెడ్డి సమాధానం చెప్పాలని ఎన్ఎస్యూఐ కార్యకర్తలు,విద్యార్థులు రోడ్డుపై కూర్చున్నారు. దాంతో రోడ్డు కు ఇరు వైపులా వాహనాలతో ట్రాఫిక్ స్తంభించింది.

# చేర్యాలలో వ్యక్తిపై విచక్షణరహితంగా దాడి



సిద్దిపేట - ప్రభాత సూర్యుడు : సిద్దిపేట జిల్లా చేర్యాలలో రైస్ మిల్లు పార్ట్ నర్ల మధ్య వివాదం వీధుల్లో కలకలం రేపింది. ఆర్థిక లావాదేవీల విషయంలో పార్ట్ నర్లల విభేదాలు బయటపడ్డాయి. లావాదేవీల చర్చ కోసం నారాయణ(65) ని మిగతా పార్ట్ నర్స్ పిలిచారు. నారాయణ రాకపోవడంతో ఇంటికి వెళ్లి నారాయణ ఇంటికి వెళ్లి బీభత్సం సృష్టించారు. అందరూ చూస్తుండగానే బయటికి తీసుకువచ్చి నారాయణపై విచక్షణ రహితంగా దాడి చేసారు. అర్ధనగ్నంగా ఉన్న నారాయణని వీధిలో తిప్పుతూ దాడి చేస్తూ అరాచకం చేసారు. అడ్డుకోబోయిన నారాయణ భార్యపై కూడా దాడికి దిగారు. బాధితుడు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసాడు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
# ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## వైభవంగా మామిడిపల్లిలో జాతర



**సిరిసిల్ల - ప్రభాతసూర్యుడు :** మాఘ అమావాస్య సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం దత్తత దేవాలయమైన కోనరావుపేట మండలం మామిడిపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. స్వామివారిని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేములవాడ దేవస్థానం మామిడిపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని దత్తత తీసుకున్నప్పటినుండి ఆలయం లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, గ్రామ కమిటీ వారు సైతం అభివృద్ధిలో పాలు పంచు కుంటు న్నారని, స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నారు.

# సంపాదకీయమ్..

## నిన్న పటేల్.. ఇప్పుడు పీవీ..

రాజకీయాలు చిత్రంగా ఉంటాయి. ఎటువైపు నుంచి ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో కూడా చెప్పడం కష్టం. వ్యూహాలు.. ప్రతివ్యూహాలకు తోడు.. నాయకుల ఎత్తుగడలు రాజకీయాలను మరింత రసవత్తరంగా మారుస్తాయి. దేశాన్ని సుదీర్ఘ కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు ఇలాంటి పరిణామాలే ఎదు–రవుతున్నాయి. తమ వారిగా.. తమ పార్టీ నాయకులుగా.. తమ నేతలుగా ఈ దేశానికి సేవ చేసిన వారికి పొరుగు పార్టీ, కరడు గట్టిన ప్రత్యర్థి పార్టీ బీజేపీ ప్రాధాన్యం ఇవ్వడం.. వారికి ఎనలేని గుర్తింపు తీసుకురావడం.. కాంగ్రెస్ పార్టీ(అచేతన వ్యవహార శైలికి నిదర్శనమని చెప్పాలో.. లేక.. కాంగ్రెస్ పార్టీ వదులుకున్న 'రత్నా'లను వడిసిపట్టుకున్నారని.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ క్రెడిట్ ఇవ్వాలో ప్రజలు నిర్ణయిస్తారు. కానీ, కాంగ్రెస్ పార్టీకి ఈ పరిణామాలు.. కొరుకుపడవు.. మింగుడు పడవు. కీలకమైన ఎన్నికల సమయంలో ఆ పార్టీని ఎంతగా ఇరుకున పెట్టాలో అంతగానూ ప్రధాని మోదీ ఇరుకున పెట్టేస్తున్నారనే చెప్పాలి. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీలో ఎంతో మంది నాయకులు ఉన్నారు. నెహ్రూ నుంచి ఇందిరమ్మ దాకా.. తర్వాత రాజీవ్ వరకు ఎంతో మంది ఆ పార్టీకి వీరవిధేయులుగా సేవలందించారు. వారిలో ఎందరు గుర్తింపు పొందారంటే.. ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటులో మాట్లాడుతూ.. "ఆ పార్టీకి కేవలం తమ కుటుంబమే కనిపించింది" అన్నట్టుగానే చెప్పాల్సి ఉంటుంది. ఇదే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి పెను ప్రమాదంగా మారింది. ఈ దేశానికి అనర్ఘ రత్నాలుగా సేవలందించిన అనేక మందిని ఆ పార్టీ దూరం చేసుకోగా.. బీజేపీ తెలివిగా.. ఒడిసి పట్టుకుంది. ఎన్నికల్లో ఓట్లు దూసుకుంటోంది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణలు.. ఒకరు.. ఉక్కుమనిషి.. సర్దార్ వల్లభాయ్ పటేల్ కాగా, రెండో వారు.. తాజాగా భారతరత్న కు ఎంపికైన ధీశాలి.. సంస్కరణల పితామహుడు.. తెలుగువారు.. స్వర్గీయ పాములపర్తి వెంకట నరసింహారావు.సహజంగాఏ దేశ రాజకీయాలు చూసినా.. ప్రత్యర్థి పార్టీకి చెందిన నాయకులను ఇటువైపు పార్టీలో ఎవరూ ప్రశంసించరు. ఏ పార్టీ కూడా వారిని తలుచుకునే అవకాశం ఇవ్వదు. కానీ, కేంద్రంలో ప్రధానిగా నరేంద్ర మోదీ కొలువుదీరిన తర్వాత.. వ్యూహం మారిపోయింది. ప్రత్యర్థి పక్షంలోనూ తమకు కలిసివస్తారని.. తమ కు మేలు చేస్తారని భావించిన నాయకులను ఓన్ చేసుకునే సంప్రదాయానికి తెరదీశారు. పైకి.. వారిని గుర్తించినట్టు ఉంటుంది.. అంతర్గతంగా.. తమ రాజకీయాలు పారినట్టు కూడా ఉంటుంది. ఉభయ కుశలోపరి రాజకీయం అంటే ఇదే! ఇదే వ్యూహానికి మోదీ ప్రభుత్వం 2015లో తీసిన తెరవెనుకు నిలువెత్తు శిల్పంగా కనిపించిన మనిషి.. భారత పూర్వ హోం శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్. ఈయనను ఓన్ చేసుకోవడంలో మోదీని మించిన నాయకుడు కానీ.. బీజేపీని మించిన పార్టీ కానీ.. కనిపించలేదు. దేశంలో తొలిసారి.. పటేల్ నిలువెత్తు విగ్రహాన్ని నిర్మించారు. ప్రపంచంలోనే అతి పెద్ద కట్టడంగా ఇది పేరు తెచ్చుకుంది. అయితే.. వాస్తవానికి.. ఈయన పనిచేసింది.. తన జీవిత కాలం తపించింది.. పదవులు పొందింది కూడా.. కాంగ్రెస్‌లోనే కావడం విశేషం. బలమైన సామాజిక వర్గంతోపాటు.. దేశం మొత్తాన్నీ ప్రభావితం చేయగల నాయకుడిగా పేరొందిన ఉక్కు మనిషి.. పటేల్‌ను కాంగ్రెస్ వదిలేసుకుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే.. అలాంటినాయకుడిని ఒడిసిపట్టుకోవడంలో ప్రధాని నరేంద్ర మోదీ సక్సెస్ అయ్యారు. గుజరాత్‌కు చెందిన పటేల్‌కు అగ్రతాంబూలం ఇస్తూ.. తొలి ఐదేళ్ల పాలనలో ఆయన పేరు తలవని రోజు.. ఆయన గురించి చెప్పని రోజు లేదంటే అతిశయోక్తి కాదు. ఫలితంగా.. అంతో ఇంతో ఓటు బ్యాంకు ఉన్న గుజరాత్‌లో కాంగ్రెస్ తుడిచి పెట్టుకుపోయింది. దేశానికి సేవలందించిన అనేక మంది ప్రదానుల్లో పీవీ నరసింహారావు ఒకరు. అయితే.. ఆయన గద్దె నెక్కే సమయానికి బొటా బొటి మెజారిటీనే ఉంది. అలాంటి క్లిష్ట పరిస్తితికి తోడు.. ఆర్థిక సమస్యలు వెంటాడాయి. దీంతో సంస్కరణలకు పునాదులు వేసి.. ప్రైవేటీకరణను, ప్రపంచీకరణను తెరమీదకి తెచ్చి.. దేశాన్ని సంస్కరణల పథంలో ముందుకు నడిపించారు. ఐదేళ్లు కూడా.. అనేక సమస్యలు వచ్చినా.. ఆయన వెన్ను చూపకుండా దేశానికి వెన్నుదన్నుగా నిలిచారు. అలాంటి నాయకుడిని కాంగ్రెస్ అప్పట్లోనే వదిలేసుకుంది. నిజమో కాదో.. తెలియదు కానీ.. పీవీ మరణించినప్పుడు.. ఆయన పార్థివ దేహాన్ని న్యూఢిల్లీలోని ఏఐసీసీ ఆఫీస్‌కు తెస్తామని అన్నా.. పార్టీ వద్దన్నదని.. ప్రచారంలో ఉంది. ఇక, ఆ తర్వాత. ఎప్పుడూ.. పీవీ మాట కాంగ్రెస్ నోట వినిపించలేదు. అలాంటి పీవీకి ఇప్పుడు భారతరత్న ఇవ్వడం ద్వారా.. పటేల్ మాదిరిగా.. పీవీని కూడా మోదీ సొంతం చేసుకున్నారనడంలో సందేహం లేదు. కాంగ్రెస్ ప్రధానిగా ఈ దేశాన్ని పాలించిన పీవీకి భారతరత్న ఇవ్వడం ద్వారా.. ఇప్పటికిప్పుడు తెలంగాణ లో బీజేపీ పుంజుకుంటుందా.. లేదా.? అనేది పక్కన పెడితే.. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ను ఎండగట్టేందుకు.. ఆ పార్టీ ఈ పదేళ్ల కాలంలో ఏమాత్రమైనా సంపాయించుకుని ఉన్న సింపతీ ఉంటే.. దానిని బదాబదలు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ సహా కమలనాథులకు పెద్ద అవకాశం చేతికి చిక్కినట్టేనని భావించవచ్చు. లేదంటే.. కాంగ్రెస్‌పై మరింత సానుభూతి పెరగకుండా.. కట్టడి చేసేందుకు ఇది అవకావం ఇచ్చేచాన్స్ ఉంది. ఎలా చూసుకున్నా.. కాంగ్రెస్ వదిలేసిందనే ప్రచారంలో ఉన్న నాయకులకు మోదీ పెద్దపీట వేశారంటేనే.. రాజకీ యంగా ఆలోచించకుండా ఉంటారా? ఓటు బ్యాంకును దృష్టిలో పెట్టుకోకుండా ఉంటారా?!

## దిగాల్సిన చోట బస్సు ఆపలేదని కండక్టర్‌ను చెప్పుతో కొట్టిన మహిళ

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** బస్సుల్లో ఆర్టీసీ సిబ్బందిపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. రెండు వారల క్రితం ఎల్బీ నగర్‌లో చిల్లర ఇవ్వమని అడిగినందుకు ఓ మహిళా ప్రయాణికురాలు కండక్టర్‌ను కాలితో తన్నిన విషయం తెలిసిందే. తాజాగా తాను దిగాల్సిన చోట బస్సు ఆపలేదని ఆగ్రహించిన ఓ మహిళ కండక్టర్‌ను చెప్పుతో కొట్టింది. శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన ప్రసన్న.. బస్సులో శివరాంపల్లి వద్ద ఓ మహిళ ఎక్కింది. ఆమె హైదర్‌గూడ కల్లు కంపౌండ్ ప్రాంతంలో దిగాల్సి ఉండగా బస్సు అత్తాపూర్‌లో దిగింది.అయితే మళ్లీ వెనక్కి వెళ్లేందుకుగాను రోడ్డు దాటి మెహదిపట్నం నుంచి ఉప్పల్ వెళ్తున్న 300 నంబర్ బస్సు ఎక్కింది. సుమారు 200 మీటర్ల దూరంలో ఉన్న బస్టాప్‌లో దిగేందుకు ప్రయత్నించగా కండక్టర్ ముత్యాల నర్సింహ ఆమెను ఎక్కడ దిగాలని అడిగారు. దీంతో ఆగ్రహానికి లోనైన ప్రసన్న మహిళలకు ఉచితంగా బస్సులు ఎందుకు నడుపుతున్నారంటూ.. ఆయనను చెప్పుతో కొట్టింది. తోటి ప్రయాణికులు ఆమెను అడ్డుకుని బస్సును రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే బస్సు పీఎస్ వద్ద ఆగగానే ఆమె అక్కడి నుంచి పరారైంది. కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అర్హులైన రైతులకే రైతు బంధు

- వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే పెట్టుబడి సహాయం
- రైతు రుణమాఫీ బరాబర్ రద్దు చేస్తాం
- గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై అన్ని విధాలుగా విచారణ
- అమరవీరుల స్థూపం, అంబేడ్కర్ విగ్రహం, సచివాలయం నిర్మాణాలపై విచారణ
- పదేళ్లు అయినా కేసీఆర్‌కి బడ్జెట్ అంచనా వేయడం రాలేదు
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో రైతు బంధును అర్హులైన రైతులకు అందేలా చూస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అనర్హులకు రైతు భరోసాఇవ్వబోమని.. వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే పెట్టుబడి సహాయం అందిస్తామని స్పష్టం చేశారు సీఎం. బడ్జెట్ సమావేశాల అనంతరం మీడియాతో మాట్లాడిన రేవంత్ రెడ్డి.. గత ప్రభుత్వ విధానాలను తూర్పారబట్టారు. అబద్దాల ప్రాతిపదికన బడ్జెట్ పెట్టదలుచుకోలేదన్నారు. వాస్తవాలకు దగ్గరగా బడ్జెట్‌ను రూపొందించామన్నారు సీఎం. అబద్ధాలు చెపితే దాన్ని కప్పిపుచ్చుకోవడానికి సంవత్సరం అంతా అబద్ధాలు చెప్పాల్సి ఉంటుందన్నారు. పదేళ్లు అయినా కేసీఆర్‌కి బడ్జెట్ అంచనా వేయడం రాలేదని విమర్శించారు. వాస్తవాలకు అనుగుణంగా బడ్జెట్ ప్రిపేర్ చేసినందుకు భట్టి విక్రమార్కకు అభినందనలు తెలిపారు సీఎం రేవంత్ రెడ్డి. రైతు రుణమాఫీ చేస్తామని పునరుద్ఘాటించారు సీఎం. మిత్తి కట్టలేకనే రైతులు అవమానంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. కమిషన్ల కోసం టెండర్లు పిలిస్తే గత ప్రభుత్వం లాగే అవుతుందని, రుణమాఫీ బరాబర్ రద్దు చేస్తామన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను తప్పకుండా రాబడతామన్నారు.

**తెలంగాణ భాష ఇలాగే ఉంటుంది..**

అసెంబ్లీ ప్రొసీజర్ అంతా స్పీకర్ చూస్తారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీలకు క్షమాపణ చెప్పే అంశం సభా అధికారులు చూసుకుంటారని, తెలంగాణ భాష ఇలాగే ఉంటుందని అన్నారు. 2014లో టీడీపీ బీఏసీ మెంబర్లుగా తనను, ఎర్రబెల్లి దయాకర్ రావును పార్టీ నిర్ణయించిందని, కానీ హరీష్ రావు తనను బీఏసీకి రానివ్వలేదని పేర్కొన్నారు రేవంత్ రెడ్డి.

**అవినీతిపై విచారణ..**

గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై అన్ని విధాలుగా విచారణ చేపడతామన్నారు. అమరవీరుల స్థూపం, అంబేద్కర్ విగ్రహం, సచివాలయం నిర్మాణాలపై విచారణ జరిపిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ విచారణ జరిపామని.. జ్యుడిషియల్ విచారణలో అసలు విషయాలు తెలుస్తాయని చెప్పారు సీఎం. మేడిగడ్డకు వెళ్దామని ఎమ్మెల్యేలందరినీ ఆహ్వానించానని చెప్పిన సీఎం.. 13వ తేదీన బీఆర్ఎస్ వాళ్లకు మీటింగ్ ఉంటే వేరే తేదీ చెప్పినా తాము ఆలోచిస్తామన్నారు. ఒకరోజు ముందు లేదా వెనుక వెళదాం అన్నా తాము సిద్ధం అని ప్రకటించారు సీఎం రేవంత్ రెడ్డి.

**వారిని అవమానిస్తున్నారు..**

తనను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఆ పార్టీ అగ్రనేతలు అవమానిస్తున్నారని సీఎం రేవంత్ అన్నారు. ఇతర పార్టీ ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి వచ్చే అంశం తన దృష్టిలో లేదని, ఎవరైనా వచ్చేందుకు రెడీగా ఉంటే.. వారి విషయంలో తమ పార్టీ నిర్ణయం తీసుకుంటుందన్నారు.

# ఉద్యోగుల గుండెల్లో రైళ్లు

### హెచ్‌ఎండీఏలో ఏసీబీ తనిఖీలతో ఆందోళన

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శివబాలకృష్ణ అరెస్ట్ తో రెవెన్యూ ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. పెద్దచేప వలకు చిక్కడంతో చిన్న చేపలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. తమ పేర్లు ఎక్కడ భయటకు వస్తాయేమోనని భయపడి చస్తున్నారు. కొన్ని రోజులు హెచ్‌ఎండీఏ కార్యాలయంలో లంచం పేరు చేబితే అధికారులు ఉలిక్కి పడుతున్నారు. ఏమైనా పనులు ఉంటే ఈ వ్యవహారం మొత్తం సద్దుమణిగిన తర్వాత చూద్దామంటూ దాటేవేస్తున్నారుహెచ్‌ఎండీఏ కార్యాలయంలో ఏ పని జరిగినా...ఏ ఫైల్ ముందుకు కదలాలన్నా చేయి తడపాల్సిందే. ఈ విషయం ఆ కార్యాలయానికి ఒక్కసారైనా వెళ్లొచ్చిన ప్రతి ఒక్కరికీ అనుభవమే. ఇక్కడ సమాన పనికి సమాన వేతనం ఇస్తారో లేదో తెలియదు కానీ...అవినీతి సొమ్ములో మాత్రం వాటాల పంపకం సమానంగా ఉంటుంది. ఫ్యూన్ దగ్గర నుంచి...డైరెక్టర్ వరకు ఎవరికి చెల్లించాల్సింది వారికి ముట్టజెప్పాల్సిందే. లేకపోతే నీ ఫైల్ అక్కడే ఆగిపోతుంది. ఏసీబీ అధికారుల గాలానికి ఏకంగా హెచ్‌ఎండీఏ డైరెక్టర్ శివబాలకృష్ణ దొరకడంతో....దిగువస్థాయి సిబ్బంది గజగజ వణికిపోతున్నారు. ఎందుకంటే హెచ్‌ఎండీఏ కార్యాలయంలో ఒక ఫైల్ మూవ్ అవ్వాలంటే డైరెక్టర్ ఒక్కరే సంతకం పెడితే సరిపోదు. ఖచ్చితంగా దిగువస్థాయి సిబ్బంది పాత్ర ఉండాల్సిందే. అధికారిక లెక్కల ప్రకారమే శివబాలకృష్ణ అక్రమ ఆస్తుల విలువ రూ.250 కోట్లు దాటిపోవడంతో....ఇప్పుడు దిగువస్థాయి సిబ్బంది పాత్రపైనా ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. కార్యాలయంలో ఆయనకు సన్నిహితంగా మెలిగిన వారు, బినామీలు దాడుల భయంతో దినదిన గండంగా గడుపుతున్నారు. ఎప్పుడు ఏసీబీ అధికారుల నుంచి పిలుపు వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. తమ పై అధికారులు ఆదేశాలు పాటించినందుకు అవినీతి మరకలు తమకు ఎక్కడ అంటుకుంటాయోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఏసీబీ నుంచి ఎప్పుడు పిలుపు వస్తుందోనని భయంగా గడుపుతున్నారు.శివబాలకృష్ణను కస్టడీలోకి తీసుకున్న ఏసీబీ అధికారులు...ఆయన ఇచ్చిన



సమాచారం మేరకు అమీర్ పేటలోని స్వ–ర్ణజయంతి కాంప్లెక్స్ లోఉన్న హెచ్‌ఎండీఏ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. కీలకమైన పత్రాలు జిరాక్స్ తీసుకోవడంతో పాటు కొన్నింటినీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకున్నారు.అన్ని దస్త్రాల పరిశీలన అనంతరం....హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగంలో ఆయన సూచనల మేరకు పలువురు ఉద్యోగులు పనిచేసినట్లు గుర్తించార. ఇప్పటి వరకు భారీ బహుళ అంతస్తుల భవనాల అనుమతులు, గేటెడ్ కమ్యూనిటీ లేఅవుట్‌లకు ఇచ్చిన అనుమతుల పత్రాలను పరిశీలించిన అధికారులు....భారీగా అవకతవకలకు పాల్పడినా అనుమతులు ఇచ్చినట్లు గుర్తించారు. అలాంటి ఫైళ్ల ద్వారా కోట్ల రూపాయలు చేతులు మారినట్లు గుర్తించారు. క్షేత్ర స్థాయిలో ప్లానింగ్ ఆఫీసర్‌తో పాటు ఏపీవోలు, జేపీవోలు తనిఖీ చేసి నివేదికను రూపొందించాల్సి ఉన్నా, డైరెక్టర్‌గా ఉన్న బాలకృష్ణ చెప్పినట్లుగా నివేదికలు ఇచ్చినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో హెచ్‌ఎండీఏడైరెక్టర్ కింద పనిచేసిన కొందరు అధికారులను కూడా ఏసీబీ అధికారులు విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. శివ బాలకృష్ణ విచారణ పూర్తయే వరకు హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు కంటి మీద కునుకు లేకుండా గడపాల్సిన పరిస్థితి నెలకొంది.

## సహజీవనం చేస్తోందన్న కారణంతో మహిళపై దాడి

### వివస్త్రగా చేసి కళ్లల్లో కారం కొట్టిన వైనం

**కామారెడ్డి - ప్రభాతసూర్యుడు :** ;సహజీవనం చేస్తోందన్న కారణంతో ఓ మహిళపై దాడి జరిగిన ఘటన కామారెడ్డి జిల్లా మాచారం మండలంలో జరిగింది. అంతటితో ఆగకుండా మహిళను వివస్త్రగా చేసి కళ్లల్లో కారం కొట్టారు. మండలానికి చెందిన ఓ మహిళ.. రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన నరేష్ అనే య–ువకుడితో సహజీవనం చేస్తోంది. గుట్టుగా సాగుతున్న వీరి వ్యవహారం కొన్నాళ్లకు బయటపడింది. నరేష్ కు పెళ్లి కావడంతో పద్ధతి మార్చుకోవాలని గ్రామపెద్దలు సూచించారు. అయినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. మ–రోసారి వారిద్దరూ సహజీవనం చేస్తున్నారనే సమాచారం తెలుసుకున్న నరేష్ భార్య కుటుంబ సభ్యులు కోపంతో ఊగిపోయారు. దుర్భాషలాడుతూ నరేష్ తో పాటు, మహిళపై దాడి చేశారు. అంతటితో ఆగకుండా మహిళను వివస్త్రగా చేశా–రు. కళ్లల్లో కారం కొట్టి కులం పేరుతో దూషించారు. దాడి నుంచి ఎలాగో అలా తప్పించుకున్న బాధితురాలు నేరుగా పోలీస్ స్టేషన్ కు వెళ్లారు. తనపై జరిగిన దాడిని వివరించారు. కులం పేరుతో దూషించారని తెలిపారు. చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఈ ఇన్సిడెంట్ ను సీరియస్ గా తీసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మహిళపై దాడి చేసిన మాచారెడ్డి మండలం అక్కపూర్ కు చెందిన ఐదుగురిని అరెస్టు చేశారు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA. E-mail: upendrabbk@gmail.com. RNI:TELTEL12215